అద్దె భవనాలు.. అవస్థలు అదనం

- సొంత భవనాలు లేక అంగన్‌వాడీ కార్యకర్తలకు కష్టాలు
- పలు కేంద్రాల్లో వసతులు కరువు
- శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రజల డిమాండ్

బ్రహ్మసముద్రం: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలను అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో కార్యకర్తలు, ఆయాలు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల పాడుబడిన, శిథిలావస్థకు చేరిన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. దీంతో వర్షాలు వచ్చినప్పుడు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కళ్యాణదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 178 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ పక్కా భవనాలు 76, అద్దె భవనాలు 64 ఉన్నాయి. ప్రీస్కూల్ బిల్డింగ్‌లు 38 ఉన్నాయి. పక్కా భవనాల్లోనూ 50 శాతం శిథిలావ్యవస్థకు చేరుకున్నాయి.

అసౌకర్యాల నడుమ కేంద్రాల నిర్వహణ...

కళ్యాణదుర్గం నియోజకవర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ప్రహరీలు లేవు. వసతులు సక్రమంగా లేవు. ఇక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో సరైన కనీస వసతులు కూడా లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి సెక్టార్‌లోని వేపులపర్తిలో గ్రామంలో 3 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కటి కూడా శాశ్వత భవనం నిర్మించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు కేవలం రూ.1000 నుంచి రూ.1500 మాత్రమే అద్దె ఇస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు, అద్దెలు పెరగడంతో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.2500 నుంచి రూ.3వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇదంతా అంగన్‌వాడీ కార్యకర్తలపైన భారం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాల నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వేపులపర్తి గ్రామంలోని అంగన్‌వాడీ అద్దె భవనం

ప్రతిపాదనలు పంపాం

కళ్యాణదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కళ్యాణదుర్గం , బ్రహ్మసముద్రం మండలాలు ఉన్నాయి. కళ్యాణదుర్గం అర్బన్ పరిధిలో అద్దె భవనాల కొరత ఉంది. ఇప్పటికే సొంత భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు పరిధిలోని భవనాల కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరయిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తాం.

– లక్ష్మీ ప్రసన్న, ఐసీడీఎస్ సీడీపీఓ, కళ్యాణదుర్గం ప్రాజెక్ట్

శాశ్వత భవనం మంజూరు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి అంగన్‌వాడీ కేంద్రం –1 దాదాపుగా 10 ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నాం. ఇప్పటికైనా శాశ్వత భవనం నిర్మించాలి.

– కే దేవేంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, వేపులపర్తి

అద్దె భారం పడుతోంది



అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె గదిలో నిర్వహిస్తున్నాం. నెలకు రూ.1500 అద్దె చెల్లించే వాళ్లం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అద్దె ధరలు పెరిగిపోయాయి. రూ.2500 నుంచి రూ.3500 పెంచారు. ప్రభుత్వం నుంచి భవనానికి అద్దె మాత్రం రూ.1500 మాత్రమే ఇస్తున్నారు. దీంతో మాపై అంగన్‌వాడీ భవనం అద్దె భారం పడుతోంది.

– వీఎం శృతి, అంగన్‌వాడీ కార్యకర్త, వేపులపర్తి

క్లుప్తంగా

దశభుజ గణపతికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. కార్తీక మాసం కావడంతో స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

పేద ముస్లిం బాలికల విద్యకు పెద్దపీట



జామీయా తాసీరియా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సొసైటీ సభ్యులు

ఉరవకొండ: ఉరవకొండలో అన్ని సౌకర్యాలతో పేద ముస్లిం బాలికలకు ఉచిత విద్యనందించడానికి జామీయా తాసీరియా మదరసాను ప్రారంభించినట్లు తాసీరియా ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ తాసీర్ బాబా తెలిపారు. ఆదివారం స్థానిక మదరసా ప్రాంగణంలో 2025 నూతన తాసీరియా క్యాలెండర్‌ను సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, కుతుబుద్దీన్ తఖీ బాబా, షకీబ్ సాబ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ తాసీర్‌బాబా మాట్లాడుతూ 7 నుంచి 10వ తరగతి అమ్మాయిలకు ఉచిత విద్య, వసతి కల్పించామన్నారు.

నేడు ఎంపీపీగా లక్ష్మిదేవమ్మ ప్రమాణ స్వీకారం



కంబదూరు: మండల పరిషత్ నూతన అధ్యక్షురాలుగా రాళ్లఅనంతపురం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మిదేవమ్మ సోమవారం ప్రమాణ స్వీకరం చేయనున్నారు. గతంలో మూడేళ్ల పాటు ఎంపీపీగా పని చేసిన తిమ్మరాజమ్మ..వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో మిగిలిన కాలానికి తాత్కాలిక ఎంపీపీగా లక్ష్మీదేవమ్మకు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు.

అనాథ వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి, దాత మల్లి

ఉరవకొండ: స్థానిక విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమంలో పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని చంద్రిక మెడికల్ స్టోర్ నిర్వాహకులు మల్లికార్జున వృద్ధులకు ఆదివారం దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు. వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు పాటిల్ నిరంజన్‌గౌడ్, మోపిడి చంద్ర, నవీన్‌స్వామి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం

రాయదుర్గంటౌన్: విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ అన్నారు. 'చలో విజయవాడ'కు వెళ్లారని సమాచారంతో ఆదివారం తెల్లవారుజామునే బంగిశివ, పట్టణ అధ్యక్షుడు వలిని ఎస్‌ఐ బాలరాజు అదుపులోకి తీసుకున్నారు. బంగి శివ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించడంతో ప్రభుత్వం ఓర్వలేక అరెస్టులు చేస్తోందన్నారు. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట



పందికుంటలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా జరిగింది.కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అమరావతి ఆస్పత్రి యండీ ముత్యాలన్న, గుమ్మనూరు నారాయణస్వామి, విడపనకల్లు మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు తదితరులు హాజరయ్యారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురం జిల్లాలోని చాలా గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యంలేక అవస్థలు పడుతున్నామని జీవీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 540 గిరిజన తండాలున్నాయని, సగానికి పైగా తండాలకు వెళ్లడానికి సరైన రోడ్డు మార్గాలు లేవన్నారు. రోడ్డు మార్గాలు లేక ఆర్టీసీ బస్సులు, ఆటోలు రాక పోకలు లేక తండాలోని గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఘనంగా గజగౌరి అమ్మవారి నిమజ్జనం





గజ గౌరీదేవి, కడ్లే గౌరమ్మ దేవి



కణేకల్లులో గజగౌరి అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



చక్కెర హారతులతో ఊరేగుతున్న ఆడపడుచులు

కణేకల్లు: మండలంలో గజగౌరి అమ్మవారి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడ్రోజులుగా గజగౌరి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు ఆదివారం ప్రత్యేక పూజలనంతరం అమ్మవారిని ఊరేగించారు. అనంతరం కాలువలో నిమజ్జనం చేశారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో ఆదివారం గజగౌరీదేవి నిమజ్జనం వైభవంగా జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గజ గౌరీదేవి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ గౌరీదేవిని తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రత్యేక పూల రథోత్సవంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా గౌరీదేవి వ్రత పూజలను నిర్వహించిన అనంతరం ఆదివారం నిమజ్జనం చేశారు.

వైభవంగా కడ్లేగౌరమ్మకు పూజలు

విడపనకల్లు: విడపనకల్లులో కడ్లే గౌరమ్మదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడ్లే గౌరమ్మ జాతరలో ఉదయం నుంచి ఆలయంలో ధ్వజారోహణ, హోమం, గౌరీదేవికి పూజలు నిర్వహించారు.

ఘనంగా వజ్రాల సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట



వజ్రాల సుంకులమ్మ

బొమ్మనహాళ్: మండల పరిధిలోని దుద్దేకుంటలో ఆదివారం వజ్రాల సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ముందుగా నూతన ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేశారు. అనంతరం ప్రతిష్ట పూజల్లో భాగంగా హోమాలు, పూజలు చేశారు. మహిళల కలశ జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సుంకలమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగు బంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆకు పూజ, మహా మంగళహారతి విశేషపూజలు చేశారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో గజగౌరీ దేవి అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో రాతిదూలం లాగుడు పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 9 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి కింద ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన మాదవరాజులస్వామి వృషభాలు 8,200 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ. 25 వేలు, బళ్లారి జిల్లా ఆంద్రాల్‌కు చెందిన ఆనంద్‌రెడ్డి వృషభాలు 7,200 అడుగులు లాగి రెండో బహుమతి రూ. 20 వేలు, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన చెన్నప్ప వృషభాలు 6,480 అడుగులు లాగి మూడో బహుమతి రూ. 15 వేలు గెలుచుకున్నాయి. ఉద్దేహాళ్‌కు చెందిన బసప్ప వృషభాలు 6,000 అడుగులు లాగి నాల్గో బహుమతి రూ.10 వేలు, ఉరవకొండకు చెందిన నిశాల్ వృషభాలు 5,560 అడుగులు లాగి ఐదో బహుమతి రూ. 5 వేలు గెలుపొందాయి.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు

- యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఉరవకొండ: ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభ ఉరవకొండలోని సీవీవీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీని యూటీఎఫ్ నేతలు ప్రారంభించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంజీవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ 2025 జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో స్వర్ణోత్సవ మహాసభ జరుగుతుందన్నారు. జిల్లా సహాయ అధ్యక్షులు రామప్ప చౌదరి, జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న బీజేపీ'



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: కార్పొరేట్ కంపెనీలకు బీజేపీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ విమర్శించారు. ఆదివారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ అధ్యక్షతన ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సభ్యుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏపీ రైతు సంఘం, ఏపీ కార్మికుల రైతు కూలీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర కుమార్, నాగమణి, రాజేశ్ గౌడ్, ఏసురత్నం, శివారెడ్డి, బీహెచ్ రాయుడు, జిల్లా కార్యదర్శి పరమేష్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సాగునీటి వనరు అయిన హంద్రీనీవాకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. మోదీ చేపట్టిన కార్మిక,కర్షక, వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గోపాల్, సీఐటీయూ రాఘవేంద్ర, రంగనాథ్, తిప్పేరమ్మ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, నాయకులు బుడేన్, లక్ష్మిదేవి, డీవైఎఫ్ఐ నాయకులు సోము, భవిత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జనవరి 5న హైందవ శంఖారావ సభ

కళ్యాణదుర్గం రూరల్: విజయవాడలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావ సభను విజయతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘచాలక్ శ్రీహమకర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని హైందవ శంఖారావ సంభకు సంబంధించిన పరివార సంస్థల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఉద్యమ కన్వీనర్ వెంకటరమణ, కో కన్వీనర్లు వేటూరు విజయభాస్కర్, నాగభూషణం, నరహరి, శ్రీకాంత్, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక సమాచార కేంద్రాలు

ఉరవకొండ: గ్రంథాలయాలు ఆధునిక ఇన్ఫర్మేషన్ సెంటర్లు అని ప్రభుత్వ ఉపాధ్యాయులు గోపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటాలు

ఉరవకొండ: విద్యార్థి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తామని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు వేమన తెలిపారు. ఆదివారం స్థానిక ఏఐఎస్‌ఏ కార్యాలయంలో నియోజకవర్గ ఏఐఎస్‌ఏ కన్వీనర్‌గా భీమేష్‌ను నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యారంగంపై నిర్లక్ష్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, రాజేష్, శ్రీరామ్, నరసింహ, వంశీ, సాగర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లోని మైలారలింగస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కాలనీవాసులు భారీ సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నారాయణకు పరామర్శ

కంబదూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనరాజ్ ఆదివారం పరామర్శించారు. బెంగళూరు ఆస్పత్రికి వెళ్లి నారాయణ వైద్యం ఖర్చులకు రూ.5వేలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మారెన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు.. బళ్లారి నుంచి డీ హీరేహాళ్ వైపు వస్తున్న ప్యాసింజర్ ఆటోను మంగళూరు నుంచి బళ్లారికి వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డాడు. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వివాహ వేడుకకు వచ్చి.. కానరానిలోకాలకు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో వివాహ వేడుకకు వచ్చిన అలివేలమ్మ అనే మహిళ గుండెపోటుతో మృతిచెందింది. ఆదివారం ముదిగల్లు గ్రామానికి చెందిన జ్యోతి, యాటకల్లుకు చెందిన బాలరాజు వివాహ వేడుకకు కుందుర్పి మండలం కరిగానిపల్లికి చెందిన అలివేలమ్మ హాజరయ్యింది. బంధువులతో మాట్లాడుతుండగా గుండెపోటు వచ్చింది. ఆమెను కళ్యాణదుర్గం పీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతిచెందింది. అలివేలమ్మకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఐక్యతకు నిదర్శనం దర్గాహొన్నూరు

- నేటి నుంచి దర్గాహొన్నూరుస్వామి ఉరుసు

బొమ్మనహాళ్: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒక్కటైన దర్గాహొన్నూరు స్వామి ఉరుసు హిందూముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పెనుకొండ బాబయ్య దర్గా తర్వాత దర్గాహొన్నూరు స్వామి ఉరుసు ఎంతో ప్రసిద్ధి చెందింది. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన వన్నూరు స్వామి దర్గాలో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 18న గంధం, 19న ఒకటో దీపారాధన, 20న రెండో దీపారాధన, 21న ఉరుసే షరీఫ్ (దేవుడి సవారీ), 22న జియారత్ ఉంటుందని కమిటీ సభ్యులు తెఇపారు. ఇక్కడ వెలసిన వన్నూరుస్వామి (సయ్యద్ సర్మాస్‌హుసేనీ చిష్తి)ని రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల హిందూ ముస్లింలు ఆరాధ్య దైవంగా కొలుస్తారు.

ప్రత్యేక బస్సులు నడపాలి : ఉరుసుకు వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తున్నందువల్ల బళ్లారి, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం , అనంతపురం నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు.

'చంద్రబాబు ఇచ్చిన మాట నిలుపుకోవాలి'

కూడేరు: గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలుపుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కేశవ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కూడేరులో పలు కాలనీల్లో సీపీఐ నాయకులతో కలిసి పర్యటించారు. ఇళ్లు లేని పేదల వివరాలను సేకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా పేదలకు ఇంటి స్థలాల మంజూరు ఊసే ఎత్తలేదన్నారు. ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అర్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, నాయకులు పార్వతీప్రసాద్, రమణ, పెరుగు సంగప్ప, ప్రసాద్, వరలక్ష్మీ, లతా, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.



అనంతపురం–బళ్లారి జాతీయ రహదారిని కమ్మేసిన పొగమంచు



ఉరవకొండ వద్ద జాతీయ రహదారిపై నిలిచిపోయిన బస్సు



మంచుతో కప్పబడిన అక్కమాంబ కొండ

మంచు ఉషోదయం

ఉరవకొండ/కళ్యాణదుర్గం: ఇటీవల తుఫాను ప్రభావంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం నీలి ఆకాశంలో మబ్బులు ముసుగేస్తుంటే.. వేకుమజాము నుంచి మంచు కమ్మేస్తోంది. ఉరవకొండ నుంచి 42వ జాతీయ రహదారి అనంతపురం–బళ్లారి హైవే, కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్లే రహదారిని ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పొగమంచు కమ్మేసింది. దట్టమైన పొగమంచుతో రహదారులన్నీ కనిపించలేదు. పొలాల వద్దకు వెళ్లే రైతులు పొగమంచును ఆస్వాదించగా, రోడ్లపై వెళ్లే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అవస్థలు పడాల్సి వచ్చింది. కొన్నిచోట్ల వాహనాలు ముందుకు వెళ్లలేక నిలిచిపోయాయి.



పొగమంచుతో నిర్మానుష్యంగా మారిన దృశ్యం



కళ్యాణదుర్గం ప్రాంతంలో మంచు